ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నదేనని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయతీలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం నుంచి అందిన పథకాలకు లబ్ధిదారులకు చదివి వినిపించడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నట్లు తెలిపారు. నవరత్నాలు హామీలు వందశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరుతున్నాయని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సులభతరంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. చిన్న చిన్న కారణాలతో పింఛన్ అందని వారికి సమస్య పరిష్కరించి పింఛన్లు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహల్‌రాజుపల్లెలో అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలని, అలాగే రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేయండి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆటలంటే గెలవడం మాత్రమే కాదు, పోరాడడమని, ఫిట్‌నెస్ అంటే నిన్ను నీవు గెలవడమని పేర్కొన్నారు. యువతలో గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని పెంచడమే ధ్యేయంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని మహాయజ్ఞంగా చేపట్టినట్లు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. కలసి ఆడుదాం, కలసి గెలుద్దాం అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, సర్పంచ్ నీలావతి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, లక్ష్మురెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని దీవించండి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- కొండామారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం


జగనన్నను ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం కొండామారిపల్లె సర్పంచ్ ఫాతిమాబీ, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ ఆధ్వర్యంలో టీఎస్ఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్స్‌ను అందించారు. స్థానిక సమస్యలు తన దృష్టికి తేవాలని కోరారు. ప్రజలు ప్రస్తావించిన చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న మార్పును ప్రజలు గమనించాలని కోరారు. అర్హులందరికీ రాజకీయ సిఫార్సులు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో జగనన్న పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా చేసుకుంటామని చెపుతున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా వృద్ధి చెందాలన్నా, పిల్లల భవిష్యత్తు బాగా ఉండాలన్నా.. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు అలాగే కొనసాగాలన్నా.. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఇస్మాయిల్, సిద్దలవేమారెడ్డి, వెలుగుచంద్ర, నీరుగట్టిరమణ, కౌన్సిలర్ ఎస్వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారా స్వాధీనం

పీలేరురూరల్ : మండలంలో 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో దాడి చేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మూడే వెంకటలక్ష్మమ్మ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది హెచ్‌సీ మునిచందరం, పీసీలు లోకేష్, సుధాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6న ఆర్టీసీ ఎండీ మదనపల్లెకు రాక

మదనపల్లె సిటీ : ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఈనెల 6న మదనపల్లెకు రానున్నారు. ఈ మేరకు ఆర్టీసీ డిపోకు సమాచారం అందింది. 6న డిపోలను పరిశీలన, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు. 7న ఆర్టీసీ -1 డిపో పరిధిలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకును ప్రారంభిస్తారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఎండీ రాక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సమస్యల పరిష్కారానికే వార్డుబాట


కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పీలేరు : సమస్యల పరిష్కారానికే వార్డుబాట కార్యక్రమం చేపట్టినట్లు సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీ, ఇందిరానగర్, మదనపల్లె రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకోవడం తోపాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శ్యానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, నాయకులు హుమయూన్, షాకీర్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జావిద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

కలకడ : మండలంలో తొమ్మిది మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసి రూ.34,940 సీజ్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి మండలంలోని కలకడ ఈద్గా మైదానం పక్కన పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది మహబూబ్‌బాషా, కాంతారావ్, సుబ్బయ్య, రమేష్ తదితరులతో కలిసి దాడులు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్
గుర్రంకొండ : మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెలవారిపల్లె సమీప గుట్టల్లో జూదమాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామానికి సమీపంలో జూదం జరుగుతోందన్న సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 1100 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ గామిరెడ్డిగారిపల్లె, ఎల్లుట్ల పంచాయతీ నల్లగుట్టపల్లెలో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గామిరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె గ్రామాల్లో గత కొంత కాలంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈదాడులో గామిరెడ్డిగారిపల్లెకు చెందిన పేరం రెడ్డికుమార్(36), నల్లగుట్టపల్లెకు చెందిన వలస రఘుపతి(34), వలస లోకేశ్వర్(40), వలస రవీంద్ర(50)లను అదుపులోకి తీసుకొని వారిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 8230 విలువచేసే 69 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నామని ఆయన తెలిపారు.

తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కేవీపల్లె : మండలంలోని యర్రచేనుపల్లె, పెదినేనికాల్వ పల్లెకు తారు రోడ్డు నిర్మాణానికి శనివారం జెడ్పీటీసీ గజ్జెల శృతి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో రూ. 3 కోట్లతో తారురోడ్డు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి, సురేంద్రరెడ్డి, అమరనాథరెడ్డి, సుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్న సీఎం కావాలి


రామసముద్రం: మాలేనత్తంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం


కలకడ : కె.బాటవారిపల్లెలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రామసముద్రం : ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మాలేనత్తం పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ కుసుమకుమారి, కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డిలు హాజరైయ్యారు. సంక్షేమ పథకాల అములో కుల, మత, రాజకీయాలకతీతంగా అన్ని సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. టీడీపీ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా పేదల కోసం కృషి చేసే జగనన్నను ఆదరించాలన్నారు. పంచాయతీ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం పథకాల బ్రోచర్లు ఆవిష్కరించి, పథకాల బోర్డును ప్రారంభించారు. అలాగే మహిళలు , నాయకులతో కలసి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణప్ప, రాధారెడ్డి, నాగరాజారెడ్డి, రాజు, రమణ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్
కలకడ : పేదల సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కె.బాటవారిపల్లె పంచాయతీకి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి, పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, రవికుమార్, మండల కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, ద్వారకనాథరెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, బయ్యన్న, భాస్కర్, జగన్‌మోహన్ రెడ్డి, కుమార్‌రెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఖాదర్‌షా ఔలియా దర్గా

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉరుసు


ఖాదర్‌షా ఔలియ దర్గా

మదనపల్లె సిటీ : ఐక్యతకు ప్రతీకగా నిలిచే హజ్రత్ ఖాదర్ షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం గంధ మహోత్సవం, 4న ఉరుసు, అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం, 5న సాయంత్రం తహలీల్ ఫాతేహా, ఖవ్వాలీ ఉంటుంది. ఈ దర్గాకు ఒక చారిత్రక విశిష్టత ఉంది. సుమారు 400 సంవత్సల క్రితం ఆరేబియా దేశం మదీనా పట్టణం నుంచి ధార్మిక ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ బీజాపూర్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మదనపల్లెకు విచ్చేసి ఇక్కడి బెంగుళూరు బస్టాండు బడేమకాన్‌లో స్థిరపడ్డారు. మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాలలో ధార్మిక ప్రచారం కొనసాగిస్తూ ఇక్కడే సమాధి అయ్యారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఉరుసు ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేకత ముషాయిరా : ఉరుసు ఉత్సవాలలో భాగంగా ఏటా నిర్వహించే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇందులో దేశ నలుమూలల నుంచి హిందూ, ముస్లిం కవులు పాల్గొని ఉర్దూభాషలో మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితం, ఆయన వ్యక్తిత్వం గురంచి కవితల రూపంలో ప్రత్యేక నాతే షరీఫ్‌లు వినిపిస్తారు. స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా ముషాయిరాకు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కవి సమ్మేళనంలో పలు రాష్ట్రాలకు చెందిన ఉర్దూ కవులు పాల్గొనున్నట్లు దర్గా ముతవల్లి మకాన్‌దార్ సయ్యద్‌హాషిం, ముషాయిరా కార్యదర్శి ఖమర్‌అమీని, కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు.

బి.కొత్తకోట ఎస్ఐ బదిలీ


రామ్మోహన్

బి.కొత్తకోట : స్థానిక ఎస్ఐ కే.రామ్మోహన్ చిత్తూరుజిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మూడువారాల క్రితమే పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శనివారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇక్కడ పని చేసిన కాలంలో కీలకమైన కేసులను పరిష్కరించారు.

గ్రామాభివృద్ధికి పథకాలే పునాది

బి.కొత్తకోట : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు అమలుచేసే పథకాలే పునాది అని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. శనివారం మండలంలోని శీలంవారిపల్లెలో సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాల గురించి వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగిరెడ్డి, రుక్మిణి, ఎంపీటీసీలు రమాదేవి, విమలమ్మ, ఎంఈఓ రెడ్డిశేఖర్, ఏపీఓ మంజుల పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పీలేరురూరల్ : తుపాన్ అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచందర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని, పొలాల వద్ద మోటార్లు, స్టాటర్లు, డబ్బాలు నీటి మునిగి ఉంటాయని తెలిపారు. స్తంభాలు కూలిపోయే ప్రమాదం, వైర్లు తెగిపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అలాగే ట్రాన్స్‌కో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే 1912 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ సుధాకర్, ఏఈ పురుషోత్తం పాల్గొన్నారు.

రసాయనాల వినియోగాన్ని తగ్గించాలి

వాల్మీకిపురం : నిత్య జీవితంలో వ్యవసాయం, పరిశ్రమల్లో రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. శనివారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.

టమాట క్రేట్ రూ. 450

ములకలచెరువు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మార్కెట్‌కు వచ్చిన టామాటాలు క్రేట్ రూ. 450 ధర పలికాయి. నాణ్యమైన 30కిలోల బాక్సు రూ. 400 నుంచి రూ. 450 వరకు ధర పలికినట్లు వ్యాపారులు తెలిపారు. తుపాన్ ప్రభావంతో టమాటా ధరలు పెరగవచ్చని వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


కలికిరి: తిరుపతిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు లాల్‌బీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఫిరోజ్

ధార్మిక చైతన్యం కల్పించడమే లక్ష్యం


మాట్లాడుతున్న లక్ష్మీపతిస్వామి

పీలేరు రూరల్ : ధార్మిక చైతన్యం కల్పించడమే లక్ష్యంగా హిందూ దార్మిక సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు బి.కొత్తకోట పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంపంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. ఉదయం పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం జానపద కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో శ్రీరామచంద్రుని మందిరంలో విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో గ్రామ గ్రామాన ధార్మిక సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ధర్మప్రచారకులు ముద్దు సాయిరాం, జిల్లా కన్వీనర్ వీరబల్లి శ్రీధర్‌రాజు, ప్రభుత్వ సంబ ంధాల ప్రముఖ్ చీపాటి వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్ రమాదేవి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి


ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గుర్రంకొండ : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ సీతమ్మ, జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి మంజూరైన క్రీడా పరికరాలను పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న క్రీడల్లో అందరూ పాల్గొనేలా చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారిని తమ పేర్లు నమోదు చేసుకొనేలా చైతన్యం చేయాలని కోరారు. ఆటల పోటీలు ముగిసిన తరువాత విజేతలకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశులు, ఎంఈఓ సురేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఏవో నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గుర్రంకొండ : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని మొటుకు, నడిమికండ్రిగ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. గతంలో నడిమికండ్రిగలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఈసారి మొటుకుకు మార్చారు.ఆయన మాట్లాడుతూ నడిమికండ్రిగలోని ఒక పోలింగ్ కేంద్రాన్ని మొటుకు గ్రామానికి మార్చడం వలన 457 మంది ఓటర్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తరలించిన పోలింగ్ కేంద్రంలో నడిమికండ్రిగ గ్రామానికి చెందిన 47 మందిని ఇదే గ్రామంలోని మరో పోలింగ్ కేంద్రంలో కలిపామన్నారు. తద్వారా ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం ఉండదన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. తహసీల్దార్ ఖాజాబీ, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, వీఆర్వో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న సింగల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్

వాల్మీకిపురం : సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సింగల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్ కోరారు. శనివారం స్థానిక సింగల్ విండో కార్యాలయంలో ఆర్థిక అక్ష రాస్యత సదస్సు నిర్వహించారు. కర్నూల్‌కు చెందిన కళాజాత బ్యాంకు పథకాలపై బ్యాంకు రుణాలు, క్రాప్ లోన్, గోల్డ్ లోన్, వాహన లోన్, భద్రత పథకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, ఘర్ ఘర్ కేసీసీ అభయం, జీరో అకౌంట్ నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాల పట్ల పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారులను ప్రోత్సహించేందుకు స్వయం ఉపాధి పథకంను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ లావణ్య, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీఈవో కుమార్ రెడ్డి, నాయకులు నీళ్లభాస్కర్, మహబూబ్‌బాషా, అబ్దుల్ కలీమ్, షాహెద్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

యునానీ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ : యునాని వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ అన్నారు. శనివారం స్థానిక తాళీంవీధిలో యునాని వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం ప్రజలకు యునాని వైద్యం, మందులపై మంచి నమ్మకం ఉందన్నారు. 1960 నుంచి 1985 వరకు గుర్రంకొండలో ప్రభుత్వ యునానీ ఆస్పత్రి ఉండేదన్నారు. అప్పట్లో ప్రజలు ఈ మందులకు బాగా అలవాటు పడ్డారన్నారు. మళ్లీ యునానీ వైద్యానికి మంచి రోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ఎస్‌బీ ఖాదిరి, కాంపౌండర్ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ట్యాప్ అకాడమీ, బెంగళూరు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 15 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారికి ఏడాదికి నాలుగు లక్షల రూపాయిలు ప్యాకేజీ ఇవ్వనున్నట్లు కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. వీరిని కాలేజీ ప్రిన్సిపల్ సతీష్‌బాబు, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ లోకేష్, వివిధ విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్ డేకు విశేష స్పందన

- ఓటు నమోదు, మార్పు చేర్పులపై 847 దరఖాస్తులు
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్


బసినికొండలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్

మదనపల్లె : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024లో భాగంగా ఎన్నికల సంఘం రెండు రోజులు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డేకు మొదటిరోజైన శనివారం విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని మదనపల్లె అర్బన్, రూరల్, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. పలువురు పోలింగ్ కేంద్రాలకు వచ్చి బీఎల్వోలను కలిసి ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది చెక్ చేసుకున్నారు. అలాగే కొత్తగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, బదిలీపై పలువురు దరఖాస్తులను అందించారు. శనివారం సాయంత్రం స్పెషల్ క్యాంపెయిన్ డే గడువు ముగిసేటప్పటికీ కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6లు 609, మరణించిన, డూప్లికేట్, ఒకచోట నుంచి మరోచోటకు ఓటు బదిలీకి సంబంధించి ఫారం-7లు 54, నివాసం ఒక చోట నుంచి మరోచోటకు బదిలీ, సవరణలు, ఎపిక్ కార్డు మార్పుకు సంబంధించి ఫారం-8లు 174... మొత్తం కలిపి 847 దరఖాస్తులు అందాయి. బసినికొండ పంచాయతీలోని పోలింగ్‌స్టేషన్లు 47, 48, 49, 50లలో మండల తహసీల్దార్ మహబూబ్‌చాంద్ బీఎల్వోలు అందుబాటులో ఉన్నది లేనిది ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఓటర్ల జాబితాలో పేర్లు పరిశీలించుకోండి
పీలేరు : ఓటర్ల జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాల పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లు పరిశీలించుకోవాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వోలకు తెలియజేయాలని తెలిపారు.

ఓటరు ప్రత్యేక శిబిరం
వాల్మీకిపురం : మండలంలో శనివారం ఓటరు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త ఓటరు నమోదు, సవరణలు చేపట్టారు. మండలంలో మొత్తం 49 చోట్ల నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయగా కొత్తగా నమోదుకు 50, తొలగింపులు 10 వచ్చాయన్నారు.

ఓటరు నమోదు పక్కాగా ఉండాలి
కలికిరి : ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆదేశించారు. మండలంలోని పత్తేగడ గ్రామ పరిధిలో 180 పోలింగ్ బూత్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన నూతనంగా వచ్చిన క్లెయిములను జేసీ పరిశీలించారు.